క్లుప్తంగా

సామాజిక సేవలు అభినందనీయం : డీఎస్పీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ రాఘవులు

చీపురుపల్లి: పోలీస్ విధుల్లో ఉంటూ మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని డీఎస్పీ ఎస్.రాఘవులు చెప్పారు. గుర్ల ఏఎస్ఐ బెల్లాన కామేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న అనాథ సహాయ కేంద్రం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వంద మంది పేదలు, దివ్యాంగులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా హాజరైన డీఎస్పీ రాఘవులు చేతులు మీదుగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉంటున్న కామేశ్వరరావు సేవలు గొప్పవన్నారు. నిరంతరం పోలీస్ విధులు తీరిక లేకుండా పని చేస్తున్నప్పటికీ పేదలకు ఎలాగైనా సేవలు అందించాలనే తపన గొప్పదన్నారు. గతంలో కూడా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బెల్లాన కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో ఎరువుల పిచికారీ



ఎరువులు పిచికారీకి ఉపయోగిస్తున్న డ్రోన్

గుర్ల: డ్రోన్‌లతో ఎరువులు పిచికారీ చేయడం వలన రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని కోటగండ్రేడు మాజీ ఎంపీటీసీ, వ్యవసాయ సలహ మండలి మాజీ అధ్యక్షుడు ముద్దాడ కేశవరావు అన్నారు. మండలంలోని కోటగండ్రేడులో ఆదివారం మొక్కజొన్న పంటకు ఎరువులు, పురుగుల మందును డ్రోన్‌తో పిచికారీ చేయించారు. వ్యవసాయంలో నూతన పద్ధతిలో డ్రోన్ ఉపయోగించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎరువుల మందును పిచికారీ చేయవచ్చునన్నారు. డ్రోన్‌తో ఎరువుల పిచికారీని రైతు సేవా కేంద్రం వీఏఏ హరి కృష్ణ, రైతులు పరిశీలించారు.

కేంద్ర మంత్రి అమిత్ షాను తొలగించాలి..

బొండపల్లి: దాదాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని సీపీఐ నియోజకవర్గ నాయకుడు పురం అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్లమెంటసాక్షిగా అనుచితవ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను తొలగించాలని కొద్దిరోజులుగా దేశ వ్యాప్తంగా అందోళనలు చేపడుతున్నా, మోదీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలో మతత్వత రాజకీయాలను బీజేపీ ప్రోత్సహిస్తోందన్నారు. వెంటనే అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించి ప్రధాని మోదీ తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభం

భోగాపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని భోగాపురం, చాకివలస గ్రామాల్లో రైతులకు మంజూరు చేసిన గోకులం షెడ్‌లను జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వందనాల రమణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉడికల అప్పయ్యమ్మ, లంక వెంకటలక్ష్మి, సీహెచ్‌సీ ఆస్పత్రి కమిటీ మెంబర్ బొల్లు త్రినాథ్, నీటి సంఘం ప్రెసిడెంట్ వరుపుల గిరి, ఎన్డీఏ కూటమి నాయకులు పల్ల రాంబాబు, పసుపులేటి లోకేష, బొద్ద రమణబాబు, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, ఏపీఓ భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు ప్రారంభం



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన నాలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. విజయనగరం, ఎస్.కోట, పార్వతీపురం డిపోలకు చెందిన నాలుగు కొత్త బస్సులకు స్థానిక విజయనగరం డిపో ఆవరణలో పచ్చజెండా ఊపారు. అనంతరం డిపో గేరేజీ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ దొన్ను దొర, ఈడీ ఎ.విజయ కుమార్, జిల్లా ప్రజారవాణా అధికారులు సీహెచ్.అప్పలనాయుడు (విజయనగరం), కె.శ్రీనివాసరావు (పార్వతీపురం), ఎస్‌కోట, విజయనగరం డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, కార్మికులు, కార్మిక సంఘ నాయకులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు గిట్టుబాటు కాని చెరకు

- ఏటా రెట్టింపవుతున్న పెట్టుబడులు
- సకాలంలో కటింగ్ ఆర్డర్ రాక అవస్థలు
- తగ్గుముఖం పట్టిన చెరకు సాగు



అమ్మకానికి సిద్ధం చేసిన చెరకు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఏటేటా రెండింతలు పెరుగుతున్న పెట్టుబడులు, వ్యవసాయ మదుపులకు తగ్గట్టుగా పెరగని మద్దతు ధరతో చెరకు రైతులు అవస్థలు పడుతున్నారు. సాధారణంగా ఏడాదికోసారి సంక్రాంతి పండగ సమయానికి చెరకు మార్కెట్లోకి అందుబాటులోకి వస్తుంది. సంక్రాంతి పండగ సమయంలో మార్కెట్లో చెరకుకు మంచి గిరాకీ ఉన్నప్పటికీ రైతుకు మాత్రం ఆ ఫలం దక్కటం లేదు. ఏడాది పొడవున కష్టించి సాగు చేసిన చెరకు పంట నుంచి తగిన ప్రతిఫలం లేకపోవటంతో సాగుకు రైతులు ఆసక్తి కనబరచటం లేదు. దీంతో నియోజకవర్గంలో చెరకు సాగు విస్తీర్ణం రానురాను తగ్గుముఖం పడుతుంది. ఏటా ఎరువుల ధరలు, కూలీల వేతనాలతో పెట్టుబడులు అమాంతంగా పెరిగిపోతున్నప్పటికీ అందుకు తగ్గట్టుగా మద్దతు ధరలు మాత్రం పెరగటం లేదని రైతులు వాపోతున్నారు.

తగ్గిన విస్తీర్ణం

నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో వ్యవసాయ బోర్లను ఆధారంగా చేసుకొని గతంలో వందల హెక్టార్ల వరకు రైతులు చెరకు పంటను పండించేవారు. ప్రస్తుతం అమాంతంగా పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధర కల్పించకపోవటంతో చెరకును సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపకపోవటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఎంత శ్రమించినా ఎకరానికి 30 టన్నుల దిగుబడి రావటం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతు పండించే చెరకు పంటకు టన్నుకు 3150 రూపాయలు మద్దతు ధర చెల్లిస్తున్నారని అంటున్నారు. ఈ మద్దతు ధర రైతుకు ఏమాత్రం కూడా గిట్టుబాటు కావటం లేదని చెరకు రైతులు వాపోతున్నారు. టన్ను చెరకు కటింగు చేయటానికి, దీంతో పాటుగా లారీల ఖర్చుతో కలిపి రెండు వేల రూపాయల పైబడి మదుపులు అవుతుంటాయని చెబుతున్నారు. పంట పండి చేతికి అందివచ్చినప్పటికీ సకాలంలో కటింగ్ ఆర్డర్ ఇవ్వకపోవటంతో చాలా వరకు పంట పొలాల్లోనే ఉండిపోవటంతో పాడైపోతుందని, దీంతో దిగుబడి మీద ప్రభావం చూపుతుందని రైతులు పేర్కొంటున్నారు. చెరకు పంట లాభసాటిగా లేకపోవటంతో రైతులు మొక్కజొన్న పంట వైపు మళ్లుతున్నారు.

మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలి

చెరకు రైతు బాగుపడాలంటే మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం ఇస్తున్న మద్దతు ధర రైతుకు ఏమాత్రం లాభసాటిగా లేదు. కటింగు ఆర్డర్ కూడా సకాలంలో రాదు. దీంతో రైతులు చెరకు సాగు చేసేందుకు ఆసక్తిని కనబరచటం లేదు. వ్యవసాయ మదుపులు రెట్టింపు కావడం, మద్దతు ధర లేకపోవటంతో రైతు నష్టపోవాల్సి వస్తుంది.

– వై.రమణ, గదబవలస, గరివిడి మండలం

ఖర్చులు పెరిగిపోయాయి

ఒకప్పుడు కంటే ప్రస్తుతం వ్యవసాయ ఖర్చులు అమాంతంగా పెరిగిపోయాయి. పెట్టుబడులకు తగిన రీతిలో మద్దతు ధరను ప్రభుత్వం కల్పించటం లేదు. ఎకరానికి రూ.40వేలు పైబడి ఖర్చులు అవుతున్నాయి. దీంతో చెరకు విడిచి పెట్టి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాల్సి వస్తుంది.

– ఎం.అప్పలనాయుడు, కెఎల్.పురం

చురుగ్గా గిరిజన యూనివర్సిటీ పనులు



యూనివర్సిటీ నుంచి జాతీయ రహదారికి వేస్తున్న 120 అడుగుల రోడ్డు



నిర్మాణంలో ఉన్న వీసీ గెస్ట్ హౌస్

దత్తిరాజేరు: మెంటాడ మండలం చినమేడపల్లి, దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల మధ్య 581 ఎకరాలలో ఏర్పాటు చేయనున్న గిరిజన యూనివర్సిటీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 2023 ఆగస్ట్ 25న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ చేతులు మీదుగా యూనివర్సిటీ పనులు ప్రారంభించారు. రూ. 236 కోట్ల నిధులతో అకడమిక్ బ్లాక్, జి+2 ఫ్లోర్లు, బాలికల వసతిగదులు, వీసీ నివాసగృహం, గెస్ట్‌హౌస్, 120 అడుగుల రోడ్డు, తదితర పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటి నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 80 కోట్లు చెల్లించినట్లు అధికారులు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

దత్తిరాజేరు: మండలంలోని చుక్కపేట గ్రామానికి చెందిన పోల సూర్యనారాయణకు రెండు లక్షల రూపాయల చెక్కును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయనగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. సూర్యనారాయణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ తెలిపారు.

కోళ్ల పరిశ్రమల వద్ద సమ్మె, నిరసనలు నిషేధం

చీపురుపల్లి: పౌల్ట్రీ పరిశ్రమలు వద్ద సమ్మెలు, నిరసన కార్యక్రమాలు నిషేధిస్తూ జిల్లా న్యాయస్థానం ఇన్‌జంక్షన్ ఉత్తర్వులు వెలువరించినట్లు శ్రీ వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.గౌరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే పరిశ్రమలో వేతన ఒప్పందం అమలు కోరుతూ కార్మికులు గత కొద్ది రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతున్న నేపథ్యంలో పరిశ్రమ యాజమాన్యం కోర్టును ఆశ్రయించినట్లు ఆమె తెలిపారు. లైవ్ స్టాక్ పరిశ్రమ కావడంతో పరిశ్రమకు 500 మీటర్లు పరిధిలో సమ్మె, నిరసన దీక్షలపై నిషేధం విధిస్తూ కోర్టు ఉత్తర్వులు వెలువరించినట్లు ఆమె తెలిపారు.

పూడికలు తొలగించండి..



వేపాడ ప్రధాన రహదారిపై నిలిచిన వాడుకనీరు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో వాహనచోదకులు, బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్ల మెట్లు, అరుగులు తొలగించడంతో కాలువలు మట్టితో పూడుకుపోయాయి. అధికారులు వెంటనే స్పందించి పూడికతీత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వివేకానంద చరిత్ర స్ఫూర్తిదాయకం..

స్వామి వివేకానంద జీవిత చరిత్ర యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, యువతకు ముఖ్య అతిథులు వివేకానంద బోధనలు వివరించారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: స్వామి వివేకానంద విగ్రహం వద్ద పుస్తకాలు ప్రదర్శిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



లక్కవరపుకోట : వివేకానందుడి వేషధారణలో ఎల్.కోట మండల కేంద్రానికి చెందిన చిన్నారి



శృంగవరపుకోట: బందవలసలో చిన్నారులకు వివేకానంద సాహిత్యం పుస్తకాలు పంపిణీ చేసిన నిర్వాహకులు



దత్తిరాజేరు: టి.భూర్జవలసలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు దుర్గాప్రసాద్, తదితరులు



గుర్ల: వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ రామారావు, తదితరులు



గజపతినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్స్‌పాల్ రావాడ సత్యనారాయణ, సిబ్బంది



గజపతినగరం: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో నివాళులర్పిస్తున్న ఎస్‌జీటీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రరావు,తదితరులు



కొత్తవలస: మండల కేంద్రంలో వివేకానంద విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న వివేకానంద సంఘ సభ్యులు



శృంగవరపుకోట: విజన్‌టెక్ ఇన్‌స్టిట్యూట్‌లో స్వామి వివేకానంద చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



వేపాడ: సోంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుడు రవిశంకర్, విద్యార్థులు

● గోదాదేవి తిరువీధి..



శృంగవరపుకోట పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో గోదాదేవి అమ్మవారి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం పూజారిని దేవి నేతృత్వంలో పలువురు మహిళలు తెల్లవారుజామునే ఆలయం వద్ద నుంచి బయలుదేరి గోదాదేవి నామసంకీర్తనలు చేస్తూ నగర సంకీర్తన చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

● ఇరవై ఏళ్ల తర్వాత కలిశారు..



శృంగవరపుకోట పట్టణంలోని విజ్ఞానజ్యోతి కళాశాలలో 20 ఏళ్ల కిందట ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులందరూ పోతనాపల్లి గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి సంఘటనలు గుర్తు చేసుకుంటూ సందడి చేశారు.

– శృంగవరపుకోట

● వితరణ..



దత్తిరాజేరు మండలంలోని షికారుగంజి గ్రామంలో అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు గ్రామాలకు చెందిన నిరుపేద వద్ధులకు దుప్పట్లు, పంచెలు, తువ్వాళ్లు, పిండి వంటలు పంపిణీ చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దావారపు సురేష్ మాట్లాడుతూ, 83 మంది నిరుపేదలకు ఎస్ భూర్జవలస ఎస్సై రాజేష్ చేతులమీదుగా దుస్తులు పంపిణీ చేసినట్లు చెప్పారు.

– దత్తిరాజేరు

మెలవకులు పాటిస్తే అధిక దిగుబడులు



గిట్టుపల్లి వద్ద పూత దశలో ఉన్న అపరాల పంట

బొండపల్లి: అపరాలు సాగు చేసే రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పెసర, మినుము పంటలు ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్నాయని చెప్పారు. వరి తర్వాత ప్రధాన పంటగా రైతులు అపరాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మంచు విపరీతంగా కురుస్తుండడంతో పేనుబంక, కాయతొలుచు పురుగు వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. పంట పిందె దశలో ఉన్నప్పుడు ఎకరాలకు కిలో మల్టీకేతో పాటు 400 గ్రాముల డైమోథియేట్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా..

- మంత్రి శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: గజపతినగరం నియోజకవర్గం నుంచి మంత్రిగా పడాల అరుణ తర్వాత తనకు అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గజపతినగరంలో పరిశ్రమలను స్థాపించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పారు. గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో పలు రహదారులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గజపతినగరం మండలం మరుపల్లి గ్రామంలో భారీ స్థాయిలో 80 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. తాటిపూడిలో టూరిజం పార్క్‌ను న్యూ మోడల్‌గా తీర్చిదిద్దుతాయని తెలిపారు. అనంతరం చదువులో రాణిస్తున్న బొండపల్లి మండలం గొల్లుపాలెం గ్రామానికి చెందిన రాజేటి పద్మజగాయత్రిని అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీవీవీ గోపాలరాజు, ఎం.శ్రీధర్, శీరంరెడ్డి రామకుమార్, ప్రదీప్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, లెంక బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.